సాక్షి మంచిర్యాల

బుధవారం । 28 । జూన్ । 2023



కడెం తీరం.. సోయగాల హారం

ఉమ్మడి జిల్లాకు దక్షిణం వైపు గోదావరి నది, ఉత్తరం వైపు పెన్‌గంగా నది మధ్యలో కడెం నది పరవళ్లు తొక్కుతోంది. జలపాతాలు దూకుతూ గోదావరిలో కలుస్తోంది. 8లో▸



అడవి తల్లికి 'తొలి' పూజ

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడడంలో ఆదివాసీలు ముందుంటారు. ఆషాఢంలో వచ్చే అకాడి పండుగను మంగళవారం ఆదివాసీ గూడేల్లో ప్రారంభించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0 /26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 11 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సోమవారం నుంచి మంగళవారం వరకు 11 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జన్నారం మండలంలో 14.7 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 5.9, లక్సెట్టిపేటలో 5.3, హాజీపూర్‌లో 6.3, కాసిపేటలో 8.3, తాండూర్‌లో 4.8, కన్నెపెల్లిలో 15.7, వేమనపల్లిలో 11.1, నెన్నెలలో 8.2, బెల్లంపల్లిలో 8.4, మందమర్రిలో 21.4, మంచిర్యాలలో 9.1, నస్పూర్‌లో 10.9, జైపూర్‌లో 14,9, భీమారంలో 7.5, చెన్నూర్‌లో 16.6, కోటపల్లిలో 10.3 మిల్లీమీ టర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపా తం జూన్ 1 నుంచి ఇప్పటివరకు 141.3 మిల్లీమీటర్లు కాగా 71 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంకా 50 శాతం లోటు నెలకొంది.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం



రక్తదాన చేస్తున్న సభ్యులు

మంచిర్యాలఅర్బన్: టీఎస్‌ఆర్టీసీ ఆదేశానుసారం మంచిర్యాల బస్టాండ్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డీఎం రవీంద్రనాథ్ ప్రారంభించారు. 40 మంది ఆర్టీసీ సిబ్బంది రక్తదానం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రక్తదాతలకు శీతలపానీయాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవపాల, బ్లడ్‌బ్యాంకు ఇంచార్జి మధుసూదన్‌రెడ్డి, ఆర్టీసీ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ పరంజ్యోతి, బ్లడ్‌బ్యాంకు సూపర్‌వైజర్ మాదవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

జైపూర్: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని డీఈవో యాదయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైస్కూల్లో హాజరు పట్టికలను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని తెలిపారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. చెత్తాచెదారాన్ని తొలగించేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. మన ఊరు–మనబడిలో భాగంగా నిర్మిస్తున్న భోజ నశాల, మూత్రశాలలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం బి.వెంకటరమణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమల, ఉపాధ్యాయులు మాధవి, శ్యాంసుందర్, రాజేశం, రమేశ్, రమాదేవి, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మె



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నస్పూర్: ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ బకాయిలు వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు మంగళవారం సమ్మె బాట పట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, మండల అధ్యక్షుడు కొయ్యల వెంకటి మాట్లాడుతూ రెండేళ్లుగా ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ డబ్బులు కార్మికుల ఖతాల్లో జమ చేయకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ తమతో చర్చలు జరిపారని, నెల రోజుల్లోపు ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ బకాయిలు ఖాతాల్లో జమ చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. చైర్మన్ హామీ మేరకు సమ్మె విరమించి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు సతీష్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.



టికెట్ టెన్షన్ !

- బీఆర్‌ఎస్ శాసనసభ్యులకు ఆశావహుల గండం
- పార్టీ సర్వేలు, నివేదికల ప్రభావంతో ఆందోళన
- జిల్లాలో ఒకరిద్దరిని మారుస్తారనే అభిప్రాయాలు
- టికెట్ల కేటాయింపుపై రాజకీయ వర్గాల్లో చర్చ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో గుబులు రేపుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ టికెట్ వస్తుందా? రాదా? అనే మీమాంసలో ఉన్నారు. తమకే టికెట్లు మళ్లీ వచ్చేలా ప్రజల్లో గ్రాఫ్ పెంచుకునే పనిలో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ బీ ఫాం ఇస్తారా? లేక కొత్త వారిని ఎంపిక చేస్తారా? అనే చర్చ జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్(జన్నారం) పరిధిలోని ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే. ఇందులో ముగ్గురు ఎమ్మెల్యేలు రెండేసి, మూడేసి సార్లు గెలుపొందిన వారే. చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ మాత్రమే తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు పెద్దపల్లి ఎంపీగా ఉన్నారు. ఈ క్రమంలో మళ్లీ ఈ నలుగురికే టికెట్లు ఇస్తారా? లేదా? అని ప్రతిపక్ష నాయకుల్లో చర్చ సాగుతోంది.

వివాదాల్లో చిన్నయ్య..

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వ్యక్తిగతంగా పలు వివాదాల్లో చిక్కుకున్నారు. ఎన్నికలకు ముందే 'ఆరిజిన్ డెయిరీ' వివాదం ఆయనను వెంటాడుతోంది. నియోజకవర్గంలో తన అనుచరుల భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు, అభివృద్ధి పనుల్లో కమీషన్ల ఆరోపణలు వచ్చాయి. బెల్లంపల్లిలో జరిగిన ప్రగతి నివేదన సభలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చిన్నయ్యపై ప్రశంసలు కురిపించారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని కొనియాడారు. మళ్లీ గెలుపించుకోవాలని ఇక్కడి ప్రజలను కోరారు. ఈ మాటలతో మళ్లీ తనకే టికెట్ అని ఎమ్మెల్యే అనుచరులు నమ్ముతున్నారు. ఇక్కడ మార్పు ఉంటుందని, అనేక ఆరోపణల నేపథ్యంలో కొత్త వారికి అవకాశం ఉంటుందనే వాదనలు ఉన్నాయి.

జిల్లాలో ఒకరిద్దరి మార్పు?

జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలపై ప్రజల్లో మద్దతు, వ్యతిరేకత, అవినీతి, అక్రమాల ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు టికెట్ల కేటాయింపులో ఎంతమేరకు ప్రభావం చూపుతాయన్నది కీలకంగా మారింది. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జిల్లాలో సీనియర్ నాయకులుగా ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి వరసగా రెండుసార్లు, అంతకుముందు కాంగ్రెస్ నుంచి గెలిచిన చరిత్ర ఉంది. ఆయనతోపాటు కొడుకు విజిత్‌రావు సైతం రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. కింది స్థాయి నాయకులు కొందరు విజిత్‌రావును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారం చేస్తున్నారు. విజిత్‌రావు గ్రామాల్లో పర్యటిస్తూ, పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. ఇటీవల జరిగిన సీఎం సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే దివాకర్‌రావు గురించి ఎటువంటి ప్రస్తావన తీసుకు రాలేదు. సభ వేదికపై శాలువా కప్పేందుకు ప్రయత్నించగా వద్దని వారించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రత్యర్థులు పలు రకాలుగా ఈ వీడియోను ప్రచారం చేశారు. తాజా పరిస్థితుల్లో తండ్రి, కొడుకుల్లో ఎవరికి టికెట్? లేక మార్పు ఉంటుందా? అనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఎమ్మెల్యేలపై నివేదికలు

ఎమ్మెల్యేలకు ప్రజల్లో బలం, ఆర్థిక స్థితిగతులు, వీరిని కాదని కొత్త వారికి అవకాశం ఇస్తే ఎలా ఉంటుందనే కోణాల్లో సర్వేలు జరిగాయి. అదే సమయంలో మార్చే చోట పార్టీలో గెలిచే సత్తా ఉన్న నాయకులు ఉన్నారా? అని ఆరా తీసినట్లు సమాచారం. టికెట్లు ఇవ్వకపోతే ఎమ్మెల్యేలను ఎలా సంతృప్తి పరచాలి? ఎవరైనా పార్టీ మారేందుకు ప్రతిపక్షాలతో టచ్‌లో ఉంటున్నారా? అనే కోణాల్లో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేతోపాటు ఇంకో ముగ్గురు నాయకుల పేర్లతో సర్వేలు చేయించారు. ఇందులో ఇద్దరి పేర్లు మాత్రమే పాజిటివ్‌గా ఉన్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే మరోసారి నివేదికలు తెప్పించుకుని ఆయా నియోజకవర్గాల్లో ప్రతిపక్ష అభ్యర్థుల బలం, సిట్టింగ్ ఎమ్మెల్యే గ్రాఫ్‌ను బట్టి టికెట్లు ఖరారు చేస్తారని సమాచారం. అప్పటి వరకు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ టెన్షన్ మాత్రం తప్పేలా లేదు.

సుమన్‌కు కేసీఆర్ అండ

చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు సీఎం కేసీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంతో మళ్లీ టికెట్ ఖాయమని అనుచరులు చెప్పుకుంటున్నారు. రూ.వందల కోట్ల నిధుల తెచ్చి చెన్నూరును తన అడ్డాగా మార్చుకుంటున్నారని, ఇక్కడి నుంచే పోటీ చేస్తారని, సీటు ఖాయమని అంటున్నారు. 2018ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే నల్లాల ఓదేలును కాదని ఎంపీగా ఉన్న సుమన్‌కు టికెట్ ఇచ్చారు. జిల్లాలో చెన్నూరు ఒక చోట మాత్రమే సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చారు. కింది స్థాయి నాయకుల్లో సుమన్‌పై వ్యక్తమవుతున్న అసంతృప్తి, టికెట్ కేటాయింపులో ప్రభావం చూపనుందా? అనేది తేలాల్సి ఉంది. ఇక ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌పై వ్యతిరేకత ఉండడంతో ఇక్కడ మార్పు ఉంటుందని బీఆర్‌ఎస్‌లోని ఓ వర్గం నాయకులే ప్రచారం చేస్తున్నారు. తమకే మళ్లీ అవకాశం వస్తుందని ఎమ్మెల్యే గట్టి నమ్మకంతో ఉన్నారు.

బయోమెట్రిక్ హాజరు

- మెడికల్ కాలేజీలో ఆధార్ ఆధారంగా అటెండెన్స్
- ఫేస్ రికగ్నైజేషన్
- ఎంసీహెచ్, ప్రభుత్వ జనరల్ ఆసత్రికీ వర్తింపు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలతోపాటు అనుబంధ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్లు, ఉద్యోగులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ వ్యవస్థను అమల్లోకి తీసుకొస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మూడు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మూడు, మాతాశిశు సంరక్షణ కేంద్రంలో మూడు బయోమెట్రిక్ మిషన్లు, ఒక్కొక్క ఫేస్ రికగ్నైజేషన్ మిషన్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బయోమెట్రిక్‌తోపాటు ఫేస్ రికగ్నైజేషన్ ద్వారానే హాజరు నమోదు చేస్తుండగా, వీటిని నేరుగా డీఎంఈకి అనుసంధానం చేయడంతో ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారు. ఇకపై వీరి పర్యవేక్షణను జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) కమాండ్ కంట్రోల్ నుంచే చేసేలా చర్యలు తీసుకుంటోంది. నేరుగా దేశ రాజధాని ఢిల్లీ నుంచే అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆసుపత్రుల్లోని వైద్యులు, ఉద్యోగుల హాజరును పరిశీలించనున్నారు. మెడికల్ కాలేజీ, ఆసుపత్రులకు హాజరైనప్పుడు ఒకసారి, విధులు ముగించుకుని వెళ్లే సమయంలో మరోసారి తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేసి, ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా హాజరు నమోదు చేయాల్సిందే. గత నెలలోనే ఇందుకు సంబంధించిన అధునాతన బయోమెట్రిక్ పరికరాలను బిగించి, సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ఉద్యోగుల వివరాలన్నింటినీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి వినియోగిస్తున్నారు. ఏ సమయానికి హాజరు అవుతున్నారు అనే దానితోపాటు పనితీరు పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

గైర్హాజరుకు చెక్

మంచిర్యాలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గత ఏడాది 100 మంది విద్యార్థులతో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించారు. ఇటీవల నీట్ పరీక్ష నిర్వహించగా, ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఏడాది మరో 100 మంది విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీట్లు పొంది చేరనున్నారు. ప్రతియేటా పెరుగుతున్న మెడిసిన్ విద్యార్థులకు అనుగుణంగా, అవసరమైన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లను నియమిస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల మెడికల్ కాలేజీకి అనుబంధంగా మాతాశిశు ఆరోగ్య కేంద్రం 130 పడకలతో కొనసాగుతోంది. నెలలో 400కు పైగా ప్రసవాలు జరుగుతుండగా, ప్రతీ రోజు 150 మందికి పైగా గర్భిణులు ఓపీకి వస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 280 పడకలతో వైద్య సేవలు అందిస్తుండగా, అన్ని విభాగాల్లో అసోసియేట్ ప్రొఫెసర్లు, వైద్యులను నియమిస్తున్నారు. ప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రస్తుతం ప్రొఫెసర్లు 11 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు ఆరుగురు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 49 మంది, సీనియర్ రెసిడెంట్లు 44, ట్యూటర్లు 4, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ 16 మంది ఉండగా, ఇతర వైద్య సిబ్బంది 20 మందికి పైగా ఉన్నారు. బయోమెట్రిక్ పరికరాలతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. హాజరు సరిగ్గా పాటించని ఉద్యోగులపై నేరుగా చర్యలు తీసుకునేందుకు ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లుగా తెలుస్తోంది.



ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజేషన్ మిషన్

సమయపాలన పాటిస్తారు



ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఎంసీహెచ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కేటాయించిన ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించేందుకు ఇప్పటికే మూడు చోట్ల బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేసి వినియోగిస్తున్నాం. డీఎంఈ నుంచి హాజరును పర్యవేక్షిస్తున్నారు. ఎన్‌ఎంసీకి అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకోసం లాగిన్‌ఐడీ వస్తే, బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర, ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా హాజరు నమోదును డీఎంఈతోపాటు ఢిల్లీలోని ఎన్‌ఎంసీ పరిశీలిస్తారు.

– డాక్టర్ ఎండీ సులేమాన్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

నస్పూర్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహణకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం ఆయన నస్పూర్‌లోని ఈవీఎం గోదామును ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల ప్రాథమిక పరిశీలనలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించినట్లు తెలిపారు. ఈవీఎం గోదాము సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలీసు బందోబస్తుతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

బదిలీలు, పదోన్నతులకు పీఆర్టీయూ కృషి

- ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల కోసం పీఆర్టీయూ కృషి చేస్తోందని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మంచిర్యాలలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ అమలుకు కృషి చేస్తామని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందుండి పోరాటం చేస్తుందని తెలిపారు. పెండింగ్ బిల్లుల పరిష్కారానికి మంత్రి హరీష్‌రావును కలిసినట్లు చెప్పారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటిస్తూ పీఆర్‌సీ కమిషన్ వేసే చర్యలు ప్రారంభమయ్యాయని అన్నారు. పండిత్, పీఈటీ సమస్యలు పరిష్కరించి పదోన్నతుల కోసం తమవంతుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జిల్లా గౌరవ అధ్యక్షురాలు శాంకరి, అసోసియేట్ అధ్యక్షురాలు ఉమాదేవి, పత్రిక సంపాదకవర్గ సభ్యుడు రాసపల్లి రవి, ఎంవీఎస్ ప్రసాద్, సాంబమూర్తి, యోగేశ్వర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

- మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి
- శాంతి కమిటీ సమావేశం

మంచిర్యాలక్రైం: శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు. బక్రీద్, తొలి ఏకాదశి, బోనాల పండుగలు వరుసగా ఉన్నందున అన్ని మతాల పెద్దలతో స్థానిక ఏసీపీ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గోవధపై నిషేధం విధించారని, గోవులను అక్రమంగా రవాణా చేసినా, వధించిన చర్యలు ఉంటాయని తెలిపారు. మతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలని, ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే 100డయల్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ రాజు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో..

బెల్లంపల్లిరూరల్: ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం తాళ్లగురిజాల పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య, మతపెద్దలు, తాళ్లగురిజాల, వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు నరేష్, విక్టర్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

కుటుంబ నియంత్రణపై అవగాహన పెంచాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ఈ నెల 27 నుంచి జూలై 10వరకు కుటుంబ సంక్షేమ, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జూలై 11న వరల్డ్ పాపులేషన్ డేను పురస్కరించుకుని కుటుంబ నియంత్రణ, సంక్షేమ కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుటుంబ నియంత్రణ తాత్కాలిక, శాశ్వత పద్ధతులపై అవగాహన కల్పిస్తూనే, చిన్న కుటుంబం ప్రాధాన్యత, కుటుంబ నియంత్రణ ప్రణాళిక, దంపతులిద్దరి బాధ్యతలు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఎస్‌వో వెంకటేశ్వర్లు, డీపీవో రాఘవ, ఆప్తాలమిక్ ఆఫీసర్ శంకర్, డీడీఎం ప్రవళిక పాల్గొన్నారు.




పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు, అధికారులు

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో వైద్యసేవలు

మంచిర్యాలటౌన్: మహిళల్లోని ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకంగా ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా పొందాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ, సాయికుంట బస్తీ దవాఖానాల్లో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళా ప్రత్యేక కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రతీ మంగళవారం మహిళల కోసమే నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు జిల్లాలో 4,016 మందికి పరీక్షలతోపాటు వైద్యం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, హెచ్‌ఈవో నాందేవ్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

దండేపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపేటలో మంగళవారం రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 48గంటల్లో డబ్బులు జమ చేస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం 40 రోజులు గడిచినా చెల్లించకపోవడం శోచనీయమని అన్నారు. రైతులు గుండారపు లచ్చయ్య, ఆకుల రామన్న, కనక జంగు, కుందారపు రాజన్న, అలిశెట్టి స్వామి, గోపతి నగేష్, ఆడి బాలయ్య పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4, 5వ తరగతుల్లో ప్రవేశాల కోసం మండల, జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపిక పోటీలు ఎంఈవోల ఆధ్వర్యంలో నిర్వహించి, జిల్లా స్థాయి ఎంపిక పోటీలను జిల్లా యువజన క్రీడల శాఖ ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే ఎంపిక పోటీలకు పంపిస్తామని తెలిపారు. ప్రతీ తరగతికి 20 మంది బాలురు, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మండల విద్యాధికారిని కలిసి వివరాలను తెలుసుకోవాలని సూచించారు.

అర్హతలివే...

- విద్యార్థుల వయస్సు 4వ తరగతికి 8–9 ఏళ్లలోపు 01-09-2014 నుంచి 31-08-2015లోపు, 5వ తరగతి కోసం 9–10 సంవత్సరాలలోపు 01-09-2013 నుంచి 31-08-2014లోపు జన్మించి ఉండాలి.
- మండల స్థాయిలో ఎంపిక పోటీలు జూలై 1 నుంచి 5లోపు నిర్వహిస్తారు.
- 4, 5వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి ఎంపికలు జూలై 12, 13వ తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తారు.
- మండల స్థాయిలో ప్రతీ తరగతికి 20 మంది బాలురు, 20 మంది బాలికలకు మించకుండా పంపించాలి.
- జిల్లాస్థాయిలో ప్రతీ తరగతికి 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.
- రాష్ట్రస్థాయిలో జూలై 25న పోటీలు నిర్వహిస్తారు.
- వయస్సు, విద్య ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్, జిరాక్సులు, 10 పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్, జిరాక్సు తీసుకురావాలి.

జిల్లా, రాష్ట్రస్థాయి ఎంపికకు పరీక్షలు

జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎంపిక కోసం ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాండ్ జంప్ రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటి టెస్టు, 1కేజీ మెడిసిన్ బాల్‌పుట్, 800 మీటర్ల రన్, మెడికల్ టెస్టు, ఏజ్ వెరిఫికేషన్ చేస్తారు.

క్లుప్తంగా

'మైసమ్మ'పై నిషేధం లేదు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్ల వద్ద కార్మికులు ఆనవాయితీగా చేసుకునే మైసమ్మపై ఎలాంటి నిషేధంలేదని ఏరియా జీఎం సంజీవ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు ఉద్యోగులు, అధికారులు మద్యం సేవించడం, జూదం ఆడడం, కొట్లాటకు దిగడం వంటివి చేస్తున్నారని తమదృష్టికి వచ్చిందని, మైన్స్‌రూల్స్ 1955 ప్రకారం ఇవి నిషేధమన్నారు. ఈ చట్టాలన్ని అమలు చేస్తూ తాము ఆదేశాలు జారీ చేశామన్నారు. కానీ దీనిని కొందరు తప్పుగా అర్థం చేసుకుని మైసమ్మకు పూజలు నిషేధించినట్లు ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని సుంపుటంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. దస్నూరి రామన్నకు చెందిన ఎద్దు మంగళవారం ఉదయం గ్రామ శివారులోకి మేతకోసం వెళ్లింది. మేత మేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. ట్రాన్స్‌కో అధికారులు శైలేష్, ఉదయ్ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు.

డిగ్రీ పరీక్షకు ఒకే ఒక్కరు..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మంగళవారం ఒకే ఒక విద్యార్థిని పరీక్ష రాసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు జంబ్లింగ్ పద్ధతిలో బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. బీకాం కంప్యూటర్ చదువుతున్న కె.తిరుపతమ్మ మాత్రమే పరీక్షకు హాజరుకాగా చీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్, ఇన్విజిలేటర్, కానిస్టేబుల్, క్లర్క్, ఆయా మరో ఇద్దరు ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి వచ్చింది.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

కౌటాల: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తాటినగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం ప్రమోద్(24)కు సిర్పూర్(టి) మండలంలోని పారిగాంకు చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా దంపతుల మధ్య కలహాలు చోటు చేసుకోవడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని సోదరుడు సంగీత్‌రావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉడుమును చంపిన ఒకరి రిమాండ్

జన్నారం(ఖానాపూర్): షెడ్యూల్ 1 వన్యప్రాణి ఉడుము (బెంగాల్ మానిటర్)ను హతమార్చిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చింతగూడ సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు. చింతగూడ గ్రామానికి చెందిన పానగంటి శ్రీను కవ్వాల్ టైగర్‌జోన్ లోని అటవీప్రాంతంలో ఈ నెల 24న ఉడుమును చంపినట్లు వచ్చిన సమాచారం మేరకు అతనిపై కేసు నమోదు చేశారు. మంగళవారం అరెస్టు చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చగా కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది.



పొచ్చర జలపాతం



కనకాయి జలపాతం




కుంటాల జలపాతం

కడెం తీరం.. సోయగాల హారం

ప్రకృతికి నిలయంగా.. నదీ పరీవాహకం

- గోదావరికి ఉపనదిగా...
- సాగుకు జీవనదిగా..
- జలపాతాలకు నిలయం
- ఆదిలాబాద్ జిల్లా దక్షిణ కాశ్మీరంలో కడెం నది ఓ భాగం

కడెం నది
ప్రారంభం : ఉమార్దా(బి), ఆదిలాబాద్ జిల్లా
ముగింపు : బెల్లాల్ (పెద్దూర్) నిర్మల్ జిల్లా
పొడవు : 86 కిలోమీటర్లు
నదిపై ప్రధాన సాగు నీటి ప్రాజెక్టు : కడెం ప్రాజెక్టు
జలపాతాలు : కుంటాల, పొచ్చర, కనకాయి, బంద్రేవ్, గాయత్రి



కడెం ప్రాజెక్ట్ అందాలు

బజార్‌హత్నూర్(బోథ్): ఆదిలాబాద్ జిల్లా అడవులు, నదులు, జలపాతాలు, పచ్చదనం ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధి. జిల్లాను దక్షిణ కాశ్మీర్‌గా పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు దక్షిణం వైపు గోదావరి నది, ఉత్తరం వైపు పెన్‌గంగా నది మధ్యలో కడెం నది పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలో కడెం నది ప్రధానమైనది. కడెం నది కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ప్రవహించడంతో ఎక్కువ భాగం అడవుల గుండా ప్రవహిస్తూ, రాళ్లపై సవ్వడులు చేస్తూ జలపాతాలు దూకుతూ గోదావరి నదిలో కలుస్తోంది. నదీ తీరం సాగుకు జీవం పోస్తోంది.

కడెం నది ప్రయాణం ఇలా..
మండలంలోని ఉమార్దా వద్ద ప్రారంభమై గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కనకాయి అటవీ ప్రాంతంలో నదికి 17కిలోమీటర్ల వద్ద కనకాయి జలపాతం, బంద్రేవ్ జలపాతం, గొలుసుల గుండం ఉన్నాయి. మరో 12 కిలోమీటర్ల ప్రయాణం తర్వాత నేరడిగొండ మండలంలో కుమారి వద్ద ప్రవేశిస్తుంది. కడెం నదికి ఉపనది అయిన బోథ్ మండలంలోని పెద్ద వాగుపై పొచ్చర జలపాతం ఉంది. కుమారి గ్రామ సమీపంలోనే కడెం నదిపై రాష్ట్ర ప్రభుత్వం 5.30 టీఎంసీల నీటి సామర్థ్యంతో మూడు మెఘావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.1100 కోట్ల నిధులతో కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. అక్కడి నుంచి నది 10కిలో మీటర్లు ముందుకు వెళ్లాక కడెం నదికి ఉపనది అయిన ఇచ్చోడ మండలంలోని గుండివాగుపై గాయత్రి జలపాతం ఉంది. ఈ జలపాతం వద్ద జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. కడెం నది అక్కడి నుంచి మరో 11కిలో మీటర్లు ముందుకు వెళ్లిన తర్వాత నేరడిగొండ మండల పరిధిలో కవ్వాల్ అభయారణ్యం (టైగర్ జోన్)లో రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన, ప్రసిద్ధి చెందిన కుంటాల జలపాతం ఉంది. ఈ జలపాతానికి జూలై నుంచి జనవరి వరకు రోజుకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. అక్కడి నుంచి 80 కిలో మీటర్లు ప్రయాణిస్తే కడెం మండల కేంద్రం సమీపంలో కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయణరెడ్డి ప్రాజెక్టు)ను నిర్మించారు.

ఉప నదుల సమాహారం..
కడెం నది ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో ఉంది. నది పరీవాహకం బజార్‌హత్నూర్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, సిరికొండ, కడెం, పెంబి మండలాల పరిధిలో ఉంది. కడెం నదికి చలివాగు, గాణాపురం వాగు, బతుకమ్మ వాగు, సిక్కుమాను వాగు, పలుకేరు వాగు, దట్కివాగు, రాగిదోబ, గుండివాగు, వాంకిడి వాగు, పెద్దవాగు, కమ్రపడ్డ వాగులు ఉపనదులు ఉన్నాయి. ఈ వాగుల పరిధిలో చెరువులు, నీటికుంటలు అనేకం.

కడెం నది పరీవాహకం..
కడెం నది గోదావరి నదికి ఉపనది. ఇది కడెం రిజర్వ్ ఫారెస్ట్ కవ్వాల్ అభయారణ్యంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం గిరిజాయి గ్రామపంచాయతీ పరిధిలోని ఉమర్దా గ్రామం వద్ద మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రారంభవుతోంది. 86 కిలో మీటర్ల పొడువున ఆగ్నేయ దిశలో ప్రవహించి కడెం మండలం బెల్లాల్ గ్రామం వద్ద గోదావరి నదిలో కలుస్తుంది.



నది ప్రారంభమయ్యే స్థలం



కడెం సాగునీటి ప్రాజెక్టు

కడెం సాగునీటి ప్రాజెక్టు
కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయణరెడ్డి ప్రాజెక్టు)ను 1958–1965 మధ్యకాలంలో నిర్మించారు. ఆయకట్టు నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68వేల ఎకరాలు సాగవుతోంది. ఈ ప్రాజెక్టులో గోదావరి నదిపై గల శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా కడెం రిజర్వాయర్‌లో నీటిని నింపుతారు. నీటి పంపిణీకి రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. ఎడమ కాలువ పొడువు 76.8 కిలోమీటర్లు, కుడి కాలువ పొడువు 8కిలో మీటర్లు.



కడెం ప్రాజెక్ట్‌పై భాగంలో..

జలపాతాల నిలయం..
రాష్ట్రంలో ఏ ప్రాంతంలో లేనటువంటి ప్రకృతి రమణీయత కడెం నది పరీవాహక ప్రాంతంలో ఉంది. ఇక్కడ ఉన్న జలపాతాలు హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. బజార్‌హత్నూర్ మండలంలోని కనకాయి, బంద్రేవ్ జలపాతాలు, బోథ్ మండలంలోని పొచ్చర, ఘన్‌పూర్ జలపాతాలు, ఇచ్చోడ మండలంలోని గాయత్రి జలపాతం, నేరడిగొండ మండలంలోని కుంటాల, కొరిటికల్ జలపాతాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తాయి.



గాయత్రి జలపాతంపై ట్రెక్కింగ్ చేస్తున్న క్రీడాకారుడు (ఫైల్)

సింగరేణి లాభాలు పంపిణీ చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

మందమర్రిరూరల్(చెన్నూర్): సీఎం కేసీఆర్ హామీ మేరకు సింగరేణికి గతేడాది ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల్లోంచి రూ.700 కోట్లు ఉద్యోగులకు వెంటనే పంపిణీ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియాలోని కేకే–5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా పడుతున్నందు వల్ల అన్ని యూనియన్ ప్రతినిధులను సమానంగా చూడాలన్నారు. 190/240 మస్టర్లు నిండిన కార్మికులకు జనరల్ మజ్దూర్లుగా ఇవ్వాలని, కార్మిక కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని, తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ అధ్యక్షుడు వెంకటస్వామి, రాజేందర్, వెంకటేశ్, ఐలయ్య, సంజీవ్, భరత్, సంజీవ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

పాలిటెక్నిక్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన

శ్రీరాంపూర్(మంచిర్యాల): సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటా కింద ఉన్న సీట్లను సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలకు మంగళవారం కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా భర్తీ చేశారు. జీఎం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అలాట్‌మెంట్ లెటర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు ఈసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. పక్కాభవనం, అన్ని వసతులతో కూడిన హాస్టల్, అధునాతన లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడాప్రాంగణం ఉన్నాయన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భావిభారత ఇంజినీర్లు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రకాశ్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అధికారి ఎం.దేవేందర్, అడ్మిషన్ ఇన్‌చార్జి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి అలాట్‌మెంట్ లెటర్ అందిస్తున్న జీఎం

వివాహం కావడంలేదని ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి
- యువకుడి నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు

జైపూర్(చెన్నూర్): వివాహం కావడంలేదని మనస్తాపం చెంది యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రౌతు మొండక్క–పాపయ్య దంపతుల కుమారుడు రౌతు సంతోష్ (27) సింగాపూర్ ఓపెన్‌కాస్టులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వివాహం కావడంలేదని మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం నర్సింగాపూర్ సమీపంలోని కుందారం వైపు వెళ్లే దారిలో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ముందుగా మంచిర్యాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.



సంతోష్ (ఫైల్)

సంతోష్ నేత్రాలతో ఇద్దరికి చూపు..
కాగా సంతోష్ నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేసి మృతుని కుటుంబ సభ్యులు మానవత్వం చాటుకున్నారు. అతని మృతి చెందినా మరో ఇద్దరికి చూపునిచ్చాడని మృతుని కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

అడవితల్లికి 'తొలి' పూజ

- గిరిజన గూడేల్లో ప్రారంభమైన 'అకాడి' సంబురం
- ఊరూరా ఉత్సవాలకు శ్రీకారం
- అడవుల్లోనే వనభోజనాలు
- ఏత్మాసార్ పేన్‌కు పూజలు ప్రారంభం
- నాలుగు మాసాలపాటు కొనసాగింపు

కెరమెరి(ఆసిఫాబాద్): సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడడంలో ఆదివాసీలు ముందుంటున్నారు. ఆషాఢమాసంలో ముందుగా వచ్చే పండుగ అకాడి. నెలవంక కనిపించడంతో అకాడి వేడుకలు ప్రారంభించి వారం రోజులపాటు నిర్వహిస్తారు. మంగళవారం పెద్దసాకడ గ్రామంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో అకాడి పండుగ ప్రారంభించారు. పౌర్ణమి వరకు వేడుకలు నిర్వహించనున్నారు.

వనంలో పూజలు..
అకాడి వేడుకల్లో భాగంగా మంగళవారం పెద్దసాకడ గ్రామ పొలిమేరలో ఉన్న బావ్రిచెట్టు వద్దకు వెళ్లారు. చెట్టుకింద ఉన్న రాజుల్‌పేన్ దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మణరేఖ లాంటి ఒక గీత గీశారు. ప్రత్యేకంగా తయారు చేసిన తుర్రను ఊదడంతో పశువులు గీతపై నుంచి అడవిలోకి పరిగెత్తాయి. అడవిలోని చెట్లు, ఆకులకు అకాడిపేన్ పూజ చేశాక ఆ ఆకులను ఇళ్లకు తీసుకెళ్లారు.

కోడితో జాతకం..
ఆదివాసీల ఆచార వ్యవహారాల్లో భాగంగా గ్రామ పటేల్ ఇంటినుంచి తెచ్చిన కోడిని దేవుడి ముందు ఉంచుతారు. దాని ముందు గింజలు పోసి జాతకం చెప్పించుకుంటారు. అనంతరం ఇంటినుంచి తెచ్చిన కోడిని బలిస్తారు. అక్కడే ఒకచోట వంటలు తయారు చేశారు. అన్నం ముద్దలుగా చేసి ఒక్కొక్కరూ ఒక్కో ముద్ద ఆరగించారు. అనంతరం మేకను బలిచ్చారు.



ఆకిపూన్ వద్ద భక్తులు



తుర్ర వాయిస్తున్న పెద్దలు



కోడి పంచాంగం చూస్తున్న ఆదివాసీలు

తుర్ర వాయింపు..
ఈ అకాడి పండుగల్లో మరో కొత్త కోణం ఉంది. అడవిలోకి వెళ్లిన పశువులు ఇళ్లకు చేరాలంటే తుర్ర వాయించాలని ఆచారం. పశువుల కాపరుల వద్ద ఈ తుర్ర ఉంటుంది. పశువులు ఎక్కడికి వెళ్లినా ఈ తుర్ర వాయిస్తే తిరిగి వస్తాయని వారి నమ్మకం. నెల రోజుల పాటు తుర్ర వాయిస్తూనే ఉంటారని పలువురు కటోడాలు చెబుతున్నారు.

ఏత్మాసార్ పేన్‌కు పూజలు!
అకాడి అనంతరం గ్రామంలోకి చేరుకున్న ఆదివాసీలు ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేశారు. నాలుగు మాసాలపాటు ఈ పూజలు కొనసాగనున్నాయి. గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు పశువులు క్షేమంగా ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. అకాడి అనంతరం నాగుల పంచమి, జాముర్‌పూస్, శివబోడి, పొలాల అమావాస్య, బడిగా, దసరా, దీపావళి పండుగలు చేస్తారు.

అనాదిగా వస్తున్న ఆచారం



అకాడి పండుగ అనాది నుంచి వస్తున్న ఆచారం. ఈ పండగ చేశాకే అన్ని పండుగలు చేసుకుంటాం. ఈ సందర్భంగా రాజుల్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఇది ఆదివాసీల ఆచారం.
– కుర్సెంగ సోంజి, పెద్దసాకడ

ఆయురారోగ్యాలతో ఉండాలని..



ప్రజలతో పాటు, పశుపక్షాదులు ఆయురారోగ్యాలతో ఉండాలని రాజుల్ దేవతను కొలిచే పండుగ ఇది. ఇందులో భాగంగానే కోడి పంచాంగం చెబుతుంది. దాని ప్రకారమే సంవత్సర కాలమంతా నడవాల్సి ఉంటుంది.
– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

ఏత్మాసార్ పేన్‌కు పూజలు



అకాడి పూజల అనంతరం ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం. గుస్సాడీ దీక్ష స్వీకరించే వారు ఈ రోజు మొక్కుకుంటారు. వన భోజనం ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.
– ఆత్రం బొజ్జిరావు, సార్‌మేడి, చౌపన్‌గూడ

సహకార బ్యాంకులో చోరీకి యత్నం

తిర్యాణి: మండల కేంద్రంలోని సహకార బ్యాంకులో చోరీకియత్నించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం బ్యాంకు స్వీపర్ వసంత్ మంగళవారం తన ఉదయం బ్యాంకు తెరిచేందుకు రాగా అప్పటికే బ్యాంకు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే మేనేజర్‌కు సమాచారం అందించాడు. అతను వచ్చి బ్యాంకులోని లాకర్లు పరిశీలించగా నగదు భద్రపర్చిన లాకర్ ఓపెన్ కాకపోవడంతో నగదు అపహరించలేదని గుర్తించారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఇంట్లో చోరీ
మండల కేంద్రానికి చెందిన సకారం తన కూతురు కాలేజీలో దింపడానికి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం హైదరాబాద్ వెళ్లాడు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఇంటికిరాగా తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానంతో ఇంట్లోకి వెళ్తుండగా ఇంటినుంచి వ్యక్తి పారిపోవడాన్ని గమనించి పోలీసులకు అప్పగించాడు. ఇంట్లో బీరువాలోని రెండు తులాల బంగారంతో పాటు రూ.12 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. రెండు చోరీలకు పాల్పడింది ఒక్కడేనా? అనే విషయం తేలాల్సి ఉంది.